www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | గురు వారం, 28 జూలై 2022 | ఎడిటర్ : గోనుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-114 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# నమ్మిన పాపానికి మునుగోడు ప్రజలను నట్టేట ముంచిన 'రాజ'కీయం



## మరో మారు మునుగోడు ప్రజలను ముంచేందుకు ఉప ఎన్నిక బేరసారాలు రెడీ !

హామీల పేరుతో మునుగోడు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని, ఎమ్మెల్యే హొదాను దర్జాగా అనుభవించి తీరా.. మునుగోడు నియోజకవర్గానికి నిధులు ఇవ్వకపోవడం వల్ల అభివృద్ధి పనులను చేయలేకపోయాను. హామీలను నెరవేర్చలేకపోయాను అని మాయ మాటలు మాట్లాడుకుంటూ వ్యక్తిగత స్వార్థంతో బీజేపీ పార్టీలో చేరేందుకు సిద్ధమైయ్యిండని. నిజంగా ఎలాంటి స్వార్థం లేకుంటే మునుగోడు ప్రజలపై ప్రేమ ఉంటే, మునుగోడు అభివృద్ధినే కోరుకుంటే అధికారంలో ఉన్న టీఆర్ఎస్ పార్టీలోకి వెళ్ళి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చెయ్యాల్సింది. కాని వ్యక్తిగత ఆదిపత్యం కోసం, కేసీఆర్‌పై అక్కస్సుతో, వ్యక్తిగత కక్ష్యసాదింపు చర్యలకు రాజగోపాల్‌రెడ్డి పూనుకున్నాడని ప్రజలు చెప్పకుంటున్నారు. కోమటిరెడ్డి బ్రాండ్‌గా గుర్తింపు పొందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బలిపశువుగా చేస్తూ తన వ్యక్తిగత రాజకీయ లబ్ధికోసం కుటుంబ సంబంధాలను కూడా చెరిపేసుకుంటున్నాడు. ఇన్నాళ్లు ప్రజావకుడు అని భ్రమ పడిన ప్రజలకు అపోహలు తొలిగే రోజులు రానే వచ్చాయి. తన ఆరటం నివురుగప్పిన స్వార్ధ రాజకీయాలకోసం మునుగోడు ఉపఎన్నిక అని మరోమారు నిరూపించారు. ప్రజా సేవకోసం మా జీవితం అని డంబాచారం చేసుకునే మీకు మీ స్వార్థం తప్పా మరోకటి కాదని, వ్యాపార లబ్ధికోసం కోట్లు కూడబెట్టాలనే లక్ష్యంతో చేస్తున్న తతంగం అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

- త్వరలో రాజీనామా, ఢిల్లీ బయలుదేరేందుకు రంగం సిద్ధం
- ఉపఎన్నికల ఖర్చులన్నీ ఈటలవే ?
- రాజగోపాల్‌రెడ్డిపై కాంగ్రెస్ హైకమాండ్ సీరియస్
- ఢిల్లీలో పెద్దల సమావేశం, హాజరు కాని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 27 (సమ సమాజం ): కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీ రాజీనామా నిర్ణయం చివరి దశకు వచ్చిందని తెలుస్తుంది. మునుగోడు నియోజక వర్గంలోని తన అను చరులు, కార్యకర్తలతో వరుస సమావేశాలు ఏర్పాటు చేసుకున్నాడు. అంతిమంగా ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. పార్టీ వీడి బీజేపీలోకి వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తన కార్యకర్తలతో చర్చించినట్లు, వారిలో కొంత మంది ససేమిరా అన్నా.. వారికి తాయిలాలతో సద్దిచెప్పేందుకు సన్నహాలు చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. మిగతా కార్యకర్తలతో బీజేపీలోకి వెళ్లేందుకు సుముఖంగా ఉన్నారని, వారందరితో కలిసి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసుకొని చేరికలు జరుపుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా నియోజక ప్రజలు పూర్తి అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికలలో మాట ఇచ్చిన వాగ్దానాలను పక్కకుపెట్టి స్వలాభంకోసం , కాంట్రాక్ట్‌లను దక్కించుకోవడానికి బేరసారాలు ఆడి ఇక్కడ ఓట్లు

2వ

### తాయిలాలు

ఎన్నికలొచ్చాయంటే చాలు రాజగోపాల్‌రెడ్డి తాయిలాలకు కొదవే ఉండదు. సర్పంచ్‌లకు ఒలెక్క, ఎంపీటీసీలకు మరో లెక్క, పరపతి ఉన్నోనికి ఒ లెక్క, పైజామా వేసుకున్నోనికి మరో లెక్క, ఎవడి లెక్క వాడిది. ఎవడి డిమాండ్ వాడిది.

తగ్గేదే లే అంటున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తన ఉపఎన్నిక గెలుపు కోసం తాయిలాల బేర సారాలు ఊపందుకున్నాయని సమాచారం.

అంతేలే ఇక్కడ సవిదలైయ్యేది ప్రజలేకదా... నాయకులు కాదు కదా !

**మీటింగ్‌లో గూడాఛారి మాట**

మొదలైతే తీసుకోండి తరువాత చూద్దాం. లిక్విడ్ మాత్రమే.. చెక్కులు లేవ్ అన్నారట !

### రాజగోపాల్‌రెడ్డి వక్యవహారంపై కాంగ్రెస్ సీరియస్

### ప్రత్యమ్నాయ చర్యలపై అధిష్టానం పరిశీలన

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాగ్రెస్‌ను వీడుతారని ఆ పార్టీ గట్టిగా నమ్ముతోంది. దీంతో తదుపరి చర్యలపై దృష్టి సారించినట్లు సమాచారం. కోమటిరెడ్డి వహారంపై కాంగ్రెస్ హైకమాండ్ సీరియస్‌గా ఉంది. రాజగోపాల్ రెడ్డిపై తక్షణంనిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటకే చర్యలు తీసుకోవాలని నాయకులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎమ్మెల్యే పదవికి రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేసే యోచనలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన రాజీనామా చేసి బిజెపిలో చేరుతారన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో మునుగోడుపై కాంగ్రెస్ దృష్టి సారించింది. అభ్యర్థి కోసం మంతనాలు చేపట్టింది. పాల్వాయి గోవర్ధన్ రెడ్డి కూతురు స్రవంతి, పల్లె రవి, నల్గొండ ప్రాంతానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీజేపీలో రాజగోపాల్ రెడ్డి చేరిక దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. తాజాగా బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి, ఈటల, వివేక్ లతో రాజగోపాల్ రెడ్డి సంప్రదింపులు జరిపారు. రెండుమూడు రోజుల్లో మరోసారి నేతలు ఢిల్లీకి వెళ్లనున్నారు. ఎమ్మెల్యే పదవికి రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేయనుండటంతో మునుగోడు ఉప ఎన్నికలకు రంగం సిద్ధమైంది.

# వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం

### కెసిఆర్ తీరుపై మండిపడ్డ పిసిసి చీఫ్ రేవంత్

### కేంద్రాన్ని సాయం కోసం నిలదీయాలని సూచన



హైదరాబాద్, జూలై 27 (సమ సమాజం): సీఎం కేసీఆర్, ప్రధాని మోడీ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో వరదల వల్ల భారీ నష్టం వాటిల్లితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఢిల్లీలో సునామి సృష్టిస్తానన్న కేసీఆర్ తన ఇంటి నుంచి బయటకు రావడం లేదన్న ఆయన..వరదసాయంపై మోడీని ప్రశ్నించేందుకు కేసీఆర్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మోడీ, కేసీఆర్ ఒకరిని ఒకరు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వివిధ బ్యాంకుల్లో రావాల్సిన లోన్లపై అధికారులతో కేసీఆర్ చర్చిస్తున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. లోన్లు వచ్చాక కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చి..కమీషన్లు తీసుకోవాలనే ప్లాన్ లో ఉన్నారని విమర్శించారు. కేసీఆర్ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రజలు గమనించాలన్న ఆయన.. తెలంగాణ ఎంపీలు కేంద్రం నుంచి నిధులు రాబట్టకుండా నిరసన చేస్తున్నట్లు ఫొటోలకు ఫోజులు ఇస్తున్నారని మండిపడ్డారు. వరదల వల్ల రాష్ట్రంలో 3వేల కోట్ల నష్టం జరిగిందని..సీఎం, పీఎం రాష్ట్ర ప్రజలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్

2వ

## ధరలపై చర్చకు పట్టుబడితే సస్పెన్షనా

### టీఆర్ఎస్ ఎంపిల స్పెన్షన్‌పై కెటిఆర్ ట్వీట్



హైదరాబాద్, జూలై 27 (సమ సమాజం): రాజ్యసభ నుంచి టీఆర్ఎస్ ఎంపీల సస్పెన్షన్ సిగ్గుచేటని మంత్రి కేటీఆర్ అన్నారు. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుపై చర్చకు ప్రభుత్వం ఎందుకు భయపడుతు న్నదని ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. 'ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, నిత్యావ సరాల మీద జీఎస్టీ పెంపుపై చర్చకు అంగీకరించకుండా కేంద్ర ప్రభుత్వం టీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీలను రాజ్యసభ నుంచి

2వ

# కాళేశ్వరం భూసేకరణపై సుప్రీం షాక్

### యధాతథ స్థితి కొనసాగించాలని ప్రభుత్వానికి ఆదేశం



న్యూఢిల్లీ, జూలై 27 (సమ సమాజం ): కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ సర్కార్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మూడో టీఎంసీ పనులపై సుప్రీంకోర్టు బుధవారం స్టే విధించింది. పర్యావరణ అనుమతులు, డీపీఆర్ లేకుండా తెలంగాణ సర్కార్ నిర్మిస్తోందంటూ ఓ పిటిషన్ దాఖలు అయ్యింది. ఈ మేరకు పర్యావరణ అనుమతులు ఉన్నాయా? అని సర్కార్‌ను కోర్టు ప్రశ్నించింది.. మూడో టీఎంసీ పనులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. ఆపై తదుపరి విచారణను నాలుగు వారాలకు సుప్రీం కోర్టు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు విస్తరణను వ్యతిరేకిస్తూ భూనిర్వాసితులు పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు విస్తరణను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. విచారణలో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టు విస్తరణపై కేంద్రానికి, తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు కూడా జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజ భూసేకరణ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. యదాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ ఆగస్టు 23న చేపట్టనున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. జస్టిస్ ఎఎం ఖన్విల్కర్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జెబి పర్దివాలా ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఆగస్టు 23 లోపు దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని, దానికి పిటిషనర్లు రిజాయిండర్ కూడా దాఖలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజక్టు పరిహారం, భూసేకరణ, నిర్వాసితుల సమస్యలపై బాధితులు 6 వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఆరు పిటిషన్లు కలిపి ఈనెల 22న సుప్రీంకోర్టు ఒకేసారి విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

## మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న మూసీ



హైదరాబాద్, జూలై 27 (సమ సమాజం ): తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో మూసి నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో, హైదరాబాద్‌లోని మూసారంబాగ్ బ్రిడ్జి వరద నీటిలో మునిగిపోయింది. దీంతో ఈ బ్రిడ్జిపై రాకపోకలను నిషేధించారు. ఇక, చాదర్‌ఘాట్‌లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరి కాలనీలు నీటమునిగాయి. నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

2వ

## హైదరాబాద్‌లో ఇడి దాడుల కలకలం

### క్యాసినో ఏజెంట్ల ఇళ్లల్లో సోదాలు

### ప్రవీణ్, మాధవరెడ్డి ఇళ్లపై దాడులు

హైదరాబాద్, జూలై 27 (సమ సమాజం ): హైదరాబాద్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు కలకలం రేపాయి. నగరంలో ఏకకాలంలో 8చోట్ల ఈడీ తనిఖీలు నిర్వహిస్తోంది. క్యాసినోల లోకల్ ఏజెంట్లు చీకోటి ప్రవీణ్, మాధవ రెడ్డి ఇంట్లో అధికారులు సోదాలు చేస్తున్నారు. ఐఎస్ సదన్ లోని ప్రవీణ్ నివాసం, బోయన్ పల్లిలోని మాధవరెడ్డి ఇంట్లో ఈడీ రైడ్స్ చేపట్టింది. ఇండో - నేపాల్ సరిహద్దుల్లో క్యాసినోల నిర్వహిస్తున్నట్లు చీకోటి ప్రవీణ్, మాధవరెడ్డిపై ఆరోపణలున్నాయి. పేకాట రాయుళ్లను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుండి ప్రత్యేక విమానాల్లో వెస్ట్ బెంగాల్ లోని బాగ్ డోగ్ర ఎయిర్‌పోర్టుకు తరలించి.. అక్కడినుండి నేపాల్ లోని హోటల్ మెచి క్రౌన్‌లో జూన్ 10 నుంచి 13 వరకు క్యాసినో ఈవెంట్ నిర్వహించారు. ఇందులో టాలీవుడ్, బాలీవుడ్,

2వ

## లోలెవల్ వంతెనపై పెరిగిన వరద

### దాటుతూ కొట్టుకుపోయిన మహిళా కూలీలు

### రంగంలోకి కాపాడిన గ్రామస్థులు



కరీంనగర్, జూలై 27 (సమ సమాజం): మహిళా కూలీలు వరదలో కొట్టుకుపోగా గ్రామస్తులు కాపాడారు. ఈ ఘటన మానకొండూరు మండలంలోని అర్కండ్ల లోలెవల్ వంతెనపై మంగళవారం సాయంత్రం జరిగింది. మండలంలోని అర్కండ్ల రైతుల వ్యవసాయ భూములు గ్రామానికి అవతలి

2వ

## సంపాదకీయం

# పాలన అంటే అప్పులు చేయడమేనా !

అప్పుచేసి పప్పుకూడా అన్న సామెత పాతది. ఇప్పుడేమో అప్పుచేసి పప్పు బెల్లాలుగా పంచిపెట్టు అంటే బాగుంటుందేమో...ఎందుకంటే రాష్ట్రాలతో పాటు కేంద్రం కూడా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి ప్రజలకు కష్టాలు తెస్తున్నాయి. ఎవరికి వారు మాకు ప్రజల మద్దతు ఉందని, వారు ఓట్లేసారని చెబుతూ ఇష్టం వచ్చి నట్లుగా పాలన చేస్తున్నారు. పాలన అంటే విచ్చలవిడితనం కాదు. పాలన అంటే అప్పులు చేయడం కాదు. పాలన అంటే ప్రజలు హింసించడం కాదు. పాలన అంటే సొంతంగా డబ్బులు వెనకేసుకుని విలాసాలు కులకడం కాదు. ప్రత్యేక విమానాలు వేసుకుని విహారాలు తిరగడం కాదు. ప్రాజెక్టుల పేరుతో ప్రజల ధనాన్ని వృధా చేయడం కాదు. తమ ఇంట్లో నుంచి సంపాదించినట్లుగా పథకాలు,సంక్షేమం పేరుతో పందేరం చేయడం కాదు. ధర్మకర్తగా ఉంటూ ప్రజల డబ్బుతో అభివృద్ధి పనులు చేయాల్సిన పాలకులు లక్షలకోట్లు అప్పులు చేస్తున్నారు. పైగా ఫలానా అయన సమయంలోనే ఎక్కువ అప్పులు చేశారని అంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ వ్యవహారం అతిగా మారింది. ప్రజల కోసం అంటూ అప్పులు చేసి పప్పుబెల్లాలుగా పంచి పెడుతున్నారు. కేంద్రం కూడా ఇలాగే అప్పులు చేస్తూ పోతున్నది. ఈ క్రమంలో ప్రజల సమస్యలను పక్కకు పెట్టి, పంచుడు విధానం వచ్చి చేరింది. ఇలాంటి దానికి వీరికి అధికారం ఎందుకివ్వాలో ప్రజలు ఆలోచించాలి. ఉచిత పథకాలతో బొక్కసాన్ని కొల్లగొట్టడమే కాకుండా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ పోతే భవిష్యత్ ఎలా అన్న ఆందోళన కలుగుతోంది. పాలకులు మాత్రం తామున్నంతలో సంపాదించు కోవడం, దోచిపెట్టడం అన్న చందంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ చేసిన వ్‌ఆయక్యలు కనువిప్పు కావాలి. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఓటర్లను మభ్యపెట్టేలా ఉచిత పథకాలపై హామీలు ఇవ్వడం చాలా తీవ్రమైన అంశమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ అన్నారు. ఈ అంశంపై ఒక దృఢ వైఖరిని అవలంబించడానికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు సంకోచిస్తోందో చెప్పాలని కూడా ప్రశ్నించారు. హేతుబద్ధత లేని ఉచితాలను కఠినంగా నియంత్రించాలని కోరుతూ బీజేపీ నాయకుడు, న్యాయవాది అశ్వినీకుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పార్టీలు ప్రకటించే ఉచితాలపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి సూచించారు. ఆ తర్వాత ఇలాంటి వాటిని కొనసాగించాలో లేదో తాము నిర్ణయిస్తామని జస్టిస్ ఎన్‌వీ రమణ పేర్కొన్నారు.

ఉచిత పథకాలపై అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేశారు. ఉచితాలను రాష్ట్రాల స్థాయిలోనే నియంత్రించాలని సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలియజేశారు. ఉచిత పథకాల అమలు వల్ల రాష్ట్రాలు దివాలా తీస్తున్నా యని పిటిషనర్ అశ్వినీకుమార్ ఉపాధ్యాయ్ గుర్తుచేశారు. ప్రస్తుతం దేశంలో అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.70 లక్షలకోట్లు అప్పు ఉందన్నారు. ఇలా చేస్తూ పోతున్న పార్టీల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. నిజానికి ఇదో మంచి సూచన. దూకుడు మీదున్న పాలకులకు కళ్లె వేయాలి. ఉచిత పథకాల పేరుతో ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులను ఇష్టం వచ్చినట్లుగా పందేరం చేయడం ఎంతమాత్రం సహేతుకం కాదు. అలాగే అప్పులు చేయడం కూడా అంతే నేరంగా పరిగణించాలి. ప్రజలను చేవలేనివాళ్లుగా చేస్తున్న తీరు సరికాదు. 2014 మార్చి 31 నాటికి దేశ అప్పులు రూ.55.87 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఈ ఏడాది చివరినాటికి అవి రూ.152.17 లక్షల కోట్లకు పెరగనున్నట్టు స్వయంగా కేంద్ర ప్రభుత్వమే పార్లమెంట్ సాక్షిగా చెప్పింది. అంటే గత తొమ్మిదేండ్లలో కేంద్రం ఏకంగా రూ.96 లక్షల కోట్ల అప్పు చేసింది. 65 ఏండ్లలో దేశం చేసిన అప్పుల

తో పోల్చితే మోదీ సర్కార్ కేవలం 9 సంవత్సరాల్లోనే రెట్టింపు అప్పులు చేసింది. తద్వారా దేశంలోని ప్రతి పౌరుని తలసరి అప్పును రెట్టింపు కంటే ఎక్కువకు పెంచింది. 2014 నాటికి దేశ జనాభా దాదాపు 129 కోట్లు. ఈ లెక్కన అప్పుడు తలసరి అప్పు సుమారు రూ.4.34 లక్షలు. ప్రస్తుతం దేశ జనాభా 140 కోట్లకు చేరినట్టు భావించినా.. ప్రతి పౌరునిపై రూ.11 లక్షల రుణభారం ఉన్నట్టే. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా అదేబాటలో పయనిస్తున్నాయి. తెలంగాణ, ఎపిలు కూడా అప్పుల్లో మునిగి తేలుతున్నాయి. అప్పులు చేసి అభివృద్ధి చేసి, ఆస్తులను సృష్టించడం లేదు. వరదలు వస్తే కనీసం ప్రజలను ఆదుకోవడానికి మాత్రం చేతులు రావు. కానీ పంచడానికి మాత్రం వెనకాడడం లేదు. రాష్ట్రాల అప్పులను కంట్రోల్ చేయాల్సిన కేంద్రం కూడా విపరీతంగా అప్పులు చేయడం క్షమించరాని నేరంగా చూడాలి. పేదలకు ఇచ్చే సబ్సిడీలకు క్రమంగా మంగళం పాడుతున్న మోదీ ప్రభుత్వం ఇప్పటివరకు తెచ్చిన అప్పులతో ఎవరిని ఉద్ధరిస్తున్న దన్నదే ప్రశ్న. పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలను భారీగా పెంచి ఖజానాలో నింపుకొన్న రూ.లక్షల కోట్లను మోదీ సర్కార్ ఏం చేస్తున్నదో చెప్పాలి. ఇకపోతే అప్పులు చేయడమే కాదు ప్రభుత్వరంగసంస్థల ను నిస్సిగ్గుగా తెగనమ్మే స్తున్నారు. ఇకపోతే అప్పులపై ఎపి ప్రభుత్వ వాదన కూడా వింతగా ఉంది. టీడీపీ హయాంలోనే అనవసర అప్పులు చేశారని ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిమితికి మించి ఏనాడూ అప్పులు చేయలేదని సమర్థించుకున్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమే ఎక్కువ అప్పులు చేస్తున్నట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని, మనకంటే ఇతర రాష్ట్రాలు ఇంకా ఎక్కువ రుణం తీసుకుంటున్నాయని గణాంకాలతో సహా వివరించారు. కాళేశ్వరంలో కోట్లు వృధా అయ్యాయని ప్రచారం సాగుతోంది. తెలంగాణలో కూడా ఉచిత పథకాలు, డబ్బుల పందేరాలు జూదాల్లా సాగుతున్నాయి. అయితే ఎవరెంత అప్పు చేశారో ఇటీవల కేంద్రం లోక్‌సభకు వివరించింది. దీనిని దృష్టిలో పెట్టుకుంటే పాలకుల అసమర్థ విధానాలు ప్రస్ఫుటంగగా కనిపిస్తున్నాయి. దీనిపై చర్చ జరగాలి. పార్లమెంటులో పథకాలపై చర్చించాలి. ఉచిత పథకాలు, డబ్బుల పందేరాలపై నియంత్రణ విధించాలి. లేకుంటే అప్పులు మాత్రమే మిగులుతాయి. పాలకలు చేసే ఈ పనలుకు ప్రజల మద్దతు ఉందన్న ప్రచారం సరికాదు. ప్రజలు పాలనకు మాత్రమే ఓట్లు వేశారిన పాలకులు గుర్తించాలి.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# నమ్మిన పాపానికి మునుగోడు ప్రజలను నట్టేట ముంచిన 'రాజ'కీయం

(మొదటి పేజీ తరువాయి..)కొనేందుకు చూస్తే ఈసారి ఓట్లు వేసేది లేదు అని ప్రజలు చెబుతున్నారు. గత రెండు రోజులుగా సోషల్‌మీడియాలో పోస్టు వైరల్ అవుతుంది. వేలకోట్ల టెండర్లు సుషీ కంపణీ ద్వారా వ్యాపారాలు చేసుకుంటు కేంద్ర ప్రభుత్వానికి అమ్ముడు పోయి మాకు డబ్బు ఆశ చూపి బీజేపీ నుంచి పోటి చేస్తానంటే నమ్మే ప్రసక్తే లేదు అని ప్రజలు అంటున్నారు. గడిచిన మూడున్నర సంవత్సరాలుగా ఏనాడు నియోజకవర్గానికి అందుబాటులో లేకుండా పోయావని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. త్వరలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే అవకాశం ఉంది. ఉపఎన్నికకు ఈటల రాజేందర్ ఆర్థికంగా తోడ్పాటు అందించే అవకాశం ఉందని తెలుస్తుంది. ఈ ఉపఎన్నికకు కర్త, కర్మ ఈటల ముందుండి నడిపించేందుకు మాట ఇచ్చినట్లు వినికిడి. ఢిల్లీ పెద్దలు కోమటిరెడ్డిపై చర్యలు తీసుకునేందుకు రేవంత్, బట్టి, ఉత్తమ్‌లతో మీటింగ్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశానికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరు కాకపోవడం గమన్హం.

# అక్రమాలు జరిగినా ఎందుకు విచారణకు ఆదేశించలేదు

- అడ్డంగా దొరికినా నంగనాచి కబుర్లతో ప్రజలను మభ్య పెడతారా
- బెంగాల్ సర్వీస్ కమిషన్ కుంభకోణంపై సర్వత్రా విమర్శలు



**కోల్‌కతా, జూలై 27 (సమ సమాజం ):** ప్రతిదానికీ నోరు పెద్దది చేసుకుని విమర్శలు గుప్పించే బెంగాల్ సిఎం మమతా బెనర్జీ తమ ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణంపై మాత్రం పెదవి విప్పడం లేదు. నోట్ల కట్టలు దొరికినా కిమ్మనడం లేదు. తేలుకుట్టిన దొంగలా వ్యవహారం మారుతున్నా పట్టించుకోకుండా అవినీతికి తాము వ్యతిరేకం అంటూ ప్రకటను మాత్రం ఇస్తున్నారు. బెంగాల్ అవినీతి కేసు బయటకు రాగానే ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఆత్మరక్షణలో ఉన్నట్టుగా కనిపిస్తోంది. పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ రిక్రూట్‌మెంట్ స్కామ్ విషయంలో ఒక పార్టీగా తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ విమర్శలు చేస్తున్నది. సిఎం మమత మాత్రం గట్టిగా మాట్లాడలేకపోతున్నారు. కుంభకోణంలో అడ్డంగా దొరికి ఓ మంత్రి అరెస్టు కావడం సిగ్గుచేటు. ఆయన దోచుకున్నదంతా దాచిపెట్టింది ఇక్కడేనంటూ ఇద్దరు మహిళల ఇళ్లల్లో నోట్ల కట్టలు పట్టుబడ్డాయి. మంత్రితో వారికి గల సాన్నిహిత్యం మీద మీడియా విశ్లేషణాత్మక కథనాలను ప్రసారం చేస్తున్నది. ఈ వ్యవహారాన్ని మమత చూసీచూడనట్లుగా ఉండడం చూస్తుంటే అనుమానాలు కలుగుతున్నాయి. తీగలాగితే డొంక కదులుతుందా అన్న చందంగా ఆమె కిమ్మనడం లేదు. ఈ కుంభకోణం గురించి తనకు ఏమాత్రం తెలియదని చెప్పడం తప్పించుకోవడం తప్ప మరోటి కాదు. అవినీతిని సహించేది లేదనీ, తప్పుచేసినవారు శిక్షార్హులేనని ప్రకటించడం ద్వారా ఆమె ఈ పాపంతో తనకు సంబంధం లేదని చెప్పదల్చుకున్నారు. కేందప్రభుత్వాన్ని తప్పుబట్టగలిగేందుకు, దీనిని రాజకీయకక్షగా అభివర్ణించేందుకు ఆమె ప్రయాసపడుతున్నప్పటికీ అలా చేయడానికి ఆస్కారం లేకుండా పోయింది. ఎందుకంటే న్యాయస్థానం ఆదేశాలమేరకే కేందప్రభుత్వ సంస్థలు రంగంలోకి దిగాయి. ఆరేళ్ళక్రితం పార్థా చటర్జీ విద్యామంత్రిగా ఉన్నప్పుడు 13వేల గ్రూప్ సీ, డీ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన ఉత్తర్వుతో ఈ కుంభకోణం మొదలైంది. అర్హుల జాబితా బహిరంగంగా ప్రకటించకుండా అభ్యర్థులు నేరుగా కంప్యూటర్‌లో లాగిన్ అయి ఫలితం తెలుసుకోవాలన్న నియమం పెట్టి, తక్కువమార్కులు వచ్చిన అభ్యర్థుల నుంచి డబ్బు తీసుకొని ఉద్యోగం ఇచ్చిన విషయం మిగతావారికి తెలియకుండా జాగ్రత్తపడ్డారు. కానీ, ఉద్యోగం దక్కని ఓ నలుగురు అభ్యర్థులు తమకంటే తక్కువ మార్కులు వచ్చిన కొందరిని గుర్తించి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈ కుంభకోణం బట్టబయలయ్యింది.

# ఎంపి హెటిరో పార్థసారథిరెడ్డిపై ఇసిలో ఫిర్యాదు

### తప్పడు అఫిడవిట్‌పై చర్య తీసుకోవాలన్న ప్రజలు

**న్యూఢిల్లీ, జూలై 27 (సమ సమాజం ):** టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు పార్థసారథి రెడ్డిపై యాదాద్రి భువనగిరి జిల్లా వాసులు కేంద్ర ఎన్నికల సంఘంలో ఫిర్యాదు చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో తనపై నమోదైన క్రిమినల్ కేసులు, ఐటీదాడులను పేర్కొనలేదని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎంపీ పార్థసారథి రెడ్డిపై వేటు వేయాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. హెజోల కంపెనీవల్ల, యాదాద్రి జిల్లాలోని అంతమ్మ గూడెంలో పార్థసారథి రెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ వల్ల 15 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వాయు, కాలుష్యం, భూ కాలుష్యం వల్ల ప్రజలు జీవించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాధితులు పేర్కొన్నారు. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో పిటిషన్ దాఖలు చేశామని, విచారణ కొనసాగుతోందన్నారు. పార్థసారథి రెడ్డి అన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. కిందస్థాయి నేతలను సీఎం కేసీఆర్ , మంత్రి కేటీఆర్ ను కలిసే పరిస్థితి లేదని పరిశ్రమల బాధిత సంఘం నేత నరేందర్ రెడ్డి అన్నారు.

# వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం

(మొదటి పేజీ తరువాయి..)చేశారు. కేసీఆర్ కేంద్రంపై పోరాట కార్యాచరణను ప్రకటించిన తర్వాతే ఢిల్లీ నుంచి కాలు బయటపెట్టాలన్నారు. కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై పార్టీ అంతర్గతంగా చర్చిస్తుందని, దీనిపై హై కమాండ్ నిర్ణయం తీసుకుంటుందని రేవంత్ రెడ్డి చెప్పారు. వరదసాయం, కోల్?మైన్ పై ఫిర్యాదు చేయడానికి అపాయింట్ మెంట్ అడిగితే.. మోడీ ఇంతవరకు స్పందించలేదని ఆయన పేర్కొన్నారు. కేంద్ర మంత్రైన కిషన్ రెడ్డి రాష్ట్ర పరిస్థితిని ప్రధానికి వివరించి నిధులను తీసుకురావాలని సూచించారు. కేసీఆర్ చేస్తున్న అక్రమాలపైనా విచారణ చేయించాలన్నారు.

# ధరలపై చర్చకు పట్టుబడితే సస్పెన్షనా

(మొదటి పేజీ తరువాయి..)10 రోజుల పాటు సస్పెండ్ చేయాలని నిర్ణయించడం సిగ్గుచేటు. ప్రభుత్వం చర్చకు ఎందుకు భయపడుతున్నది. ప్రతిపక్షాల గొంతు నొక్కడం ఎందుకు' అని మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. జీఎస్టీ, అధిక ధరలు, ద్రవ్యోల్బణంపై రాజ్యసభలో నిరసన తెలిపిన 19 మంది విపక్ష సభ్యులను డిప్యూటీ చైర్మన్ వారం రోజులపాటు సస్పెండ్ చేశారు. వీరిలో టీఆర్ఎస్‌కు చెందిన బడుగుల లింగయ్య యాదవ్, దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర కూడా ఉన్నారు. మిగిలిన 16 మందిలో ఏడుగురు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఆరుగురు డీఎంకే ఎంపీలు, ఇద్దరు సీపీఎం ఎంపీలు, ఒక సీపీఐ ఎంపీ ఉన్నారు.

# రైతుబంధు ఇచ్చి..సబ్సీడీలు లాగేశారు

### దళితబంధు పేరుతో మరోమారు మోసం

### కిసాన్ మోర్చా కార్యవర్గంలో బండి సంజయ్ విమర్శలు



**హైదరాబాద్, జూలై 27 (సమ సమాజం ):** రైతుబంధు పేరుతో అన్ని సబ్సిడీలు బంద్ చేసిందని కేసీఆర్ పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ÷ర్ అయ్యారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతు బంధు ఇచ్చి... నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెంచిందని కేసీఆర్ పై మండిపడ్డారు. రైతుల కోసం తాను ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నట్లు కేసీఆర్ గొప్పలు చెప్పుకుంటున్నా రన్నారు. ఉద్యోగులకు సరిగ్గా జీతాలివ్వలేనోడు... రైతులను ఎట్లా ఆదుకుంటాడని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టబోతోందని అబద్దాలు చెబుతూ కేసీఆర్ రైతులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఉచిత కరెంట్ పేరుతో డిస్కంలకు కేసీఆర్ రూ. 60 వేల కోట్లు బకాయి పెట్టారన్ని సంజయ్... పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో గంట సేపు కూడా కరెంట్ ఇచ్చే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. కేసీఆర్ చెప్పే మాటలను రైతులు నమ్మవద్దన్న బండి సంజయ్... రైతులను ఆదుకునే ఒకే ఒక పార్టీ బీజేపీ అని స్పష్టం చేశారు. రకరకాల స్కీములతో ఒక్కో ఎకరాకు కేంద్రం రూ.41 వేలు అందిస్తోందని తెలిపారు. ప్రతి కిసాన్ మోర్చా కార్యకర్త ఈ విషయాలన్నింటినీ రైతులకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. దళిత బంధు పేరుతో దళితులను దగా చేస్తోందని కేసీఆర్ పై బండి సంజయ్ మండిపడ్డారు. దళితులకు మూడెకరాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు అంటూ ఏవేవో కథలు చెప్పిన కేసీఆర్... ఇప్పుడు దళిత బంధు పేరుతో డ్రామాలాడుతున్నారని ÷ర్ అయ్యారు. దళితుడిని సీఎం చేయకుంటే తల నరుక్కుంటానన్న కేసీఆర్.. దళితుడిని సీఎం చేయకుంటా మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మాటలకు, చేతలకు పొంతన ఉండదన్న సంజయ్... కేసీఆర్ ను నమ్మి మరోసారి మోసపోవద్దని హెచ్చరించారు.

# ఆలేరు సాయిబాబా ఆలయంలో చోరీ

### వెండి,బంగారు అభరణాలతో పాటు నగదు లూటీ

**యాదాద్రి భువనగిరి, జూలై 27 (సమ సమాజం):** ఆలేరు పట్టణంలో భారీ చోరీ జరిగింది. సాయిబాబా దేవస్థానంలో వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సాయిబాబా ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. దొంగలు ప్రధాన ద్వారం తాళాలు కట్ చేసి దొంగతనానికి పాల్పడ్డారు. సుమారు 35 కిలోల వెండి, 5 తులాల బంగారు చైను, 45 వేల విలువగల యూఎస్ డాలర్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు ప్రాథమిక సమాచారం. ఆభరణాలతో పాటు హుండీలోని డబ్బు పోయినట్లు ఆలయ అర్చకులు చెబుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఆలయం తలుపులు పగులగొట్టిన దుండగలు గుడిలోకి ప్రవేశించారు. హుండీని కూడా పగులగొట్టి అందులో ఉన్న డబ్బును, స్వామి వారి ఆభరణాలను చోరీ చేశారు. మొత్తం 5తులాల బంగారం, 35కిలోల వెండి ఆభరణాలతో పాటుగా రూ.45వేల విలువగల యూఎస్ డాలర్లు హుండీలో ఉన్న డబ్బు పోయినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయం గుడికి వెళ్లిన అర్చకుడు ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానికుల సమాచారం మేరకు..సంఘటన స్థలానికి చేరుకున్న ఆలేరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అటవీప్రాంతానికి నష్టం లేకుండా అభివృద్ధి పనులు

### వన్యప్రాణి సంరక్షణ మండలి సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్



**హైదరాబాద్, జూలై 27 (సమ సమాజం ):** అటవీ ప్రాంతానికి తక్కువ నష్టం జరిగే విధంగా అభివృద్ధి పనులు చేపడుతామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి అటవీ అనుమతులపై రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ మండలి సమావేశం అరణ్య భవన్ లో జరిగింది. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వైస్ చైర్మన్, స్టేట్ బోర్డు ఆఫ్ వైల్డ్ లైఫ్ హోదాలో అధ్యక్షత వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖలు చేపట్టిన 30 అభివృద్ధి కార్యక్రమాలు, వాటికి అవసరమైన అటవీ అనుమతులపై ఐదో రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ మండలి సమావేశంలో చర్చ జరిగింది. అదిలాబాద్, కుమ్రం భీం అసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, ములుగు, నాగర్ కర్నూలు, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్ జిల్లాల్లో చేపట్టిన రోడ్ల విస్తరణ, విద్యుత్ ఆధునీకరణ, వైల్డ్ లైఫ్ బోర్డులో సభ్యులు అడిగిన ప్రశ్నలకు, అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యతలు, అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని, అలాగే అటవీ ప్రాంతానికి వీలైనంత తక్కువ నష్టం జరిగే విధంగా ప్రతిపాదనలు రూపొందించామని అన్నారు. రాష్ట్ర స్థాయి అనుమతుల తర్వాత కేంద్ర అనుమతులు అవసరం అయితే, ఆ ప్రతిపాదనలు కేంద్ర వైల్డ్ లైఫ్ బోర్డుకు పంపుతామని పీసీసీఎఫ్, హెచ్‌ఓఓఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్ తెలిపారు. ఈ సమావేశంలో మంత్రితో పాటు, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ. శాంతి కుమారి, పీసీసీఎఫ్‌లు స్వర్గం శ్రీనివాస్, ఎం.సీ ఫర్గెయిన్, డీసీఎఫ్ శ్రీనివాసరావు, స్టేట్ బోర్డు ఆఫ్ వైల్డ్ లైఫ్ సభ్యులు పాల్గొన్నారు.

### మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న మూసీ

(మొదటి పేజీ తరువాయి..)కాగా, ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో, వాహనదారులను అలర్ట్ చేస్తూ వేరే రూట్స్‌లో వెళ్లాలని సూచించారు. ఇదిలా ఉండగా.. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలకు వరద పోటెత్తింది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. హిమాయత్ సాగర్ 12 గేట్లు, ఉస్మాన్ సాగర్ 8 గేట్లు ఎత్తారు. ఈ క్రమంలో మూసీలోకి వరద పోటెత్తింది.

# లోలెవల్ వంతెనపై పెరిగిన వరద

(మొదటి పేజీ తరువాయి..)వైపు ఉన్నాయి. మంగళవారం ఉదయం లోలెవల్ వంతెనపై నీటి ప్రవాహం తక్కువ ఉండడంతో వరినాట్లు వేసేందుకు మహిళలు వంతెనమీదుగా ఒకరి చేతిని ఒకరు పట్టుకొని వెళ్లారు. సాయంత్రం నీటి ప్రవాహం పెరిగింది. గమనించని మహిళలు తిరిగి వస్తున్న క్రమంలో కొంత మంది బ్రిడ్జి దాటగా.. నేదురు సారమ్మ, నేదురు ఐలమ్మ, ఇజ్జిగిరి వనమ్మ, ఇజ్జిగిరి భాగ్యమ్మ, ఇజ్జిగిరి మొగిళి వాగులో నీటి ప్రమావాహంలో కొట్టుకుపోయారు. మిగతా కూలీలు కేకలు వేయడంతో పొలం పనులు ముగించి ఇంటికి వస్తున్న రైతులు, గ్రామస్తులు వెంటనే వరదలో కొట్టుకుపోతున్న ఐదుగురిని కాపాడి గట్టుకు చేర్చారు. అందరూ ప్రాణాలతో బయట పడడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. గట్టుకు చేరిన తర్వాత బాధితులు చచ్చి బతికామంటూ రోదించారు.

# హైదరాబాద్‌లో ఇడి దాడుల కలకలం

(మొదటి పేజీ తరువాయి..) డ్యాన్సర్లతో డ్యాన్సులు చేయించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. ఇందుకోసం ఒక్కో కస్టమర్ నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో ఫెమా నిబంధనల కింద కేసు నమోదు చేసిన ఈడీ దర్యాప్తులో భాగంగా సోదాలు నిర్వహిస్తోంది. చికోటి ప్రవీణ్‌పై గతంలోనే సీబీఐ కేసు నమోదు చేసినట్లు సమాచారం. లోకల్ ఏజెంట్లు మాధవ రెడ్డి, చికోటి ప్రవీణ్‌ల ప్రమేయం ఉన్నట్లు గుర్తించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు చేసింది. నేపాల్ బార్డర్‌లో ఈవెంట్ ప్రైజ్ మనీని హవాలా రూపంలో చెల్లించారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు నుంచి ఆపరేషన్ సాగింది. క్యాసినో ఒక్కో కస్టమర్ నుంచి లోకల్ ఏజెంట్లు రూ. 3 లక్షలు వసూలు చేశారు. నాలుగు రోజుల ప్యాకేజీలో భాగంగా ప్లాన్ టారిఫ్‌లు నేపాల్‌తో పాటు ఇండోనేషియాలోనూ క్యాసినో ఈవెంట్‌లు నిర్వహించారు. ఫెమా కింద కేసు నమోదు చేసిన ఈడీ.. హైదరాబాద్‌లో మొత్తం 8 చోట్ల దాడులు చేసింది.

# ప్రైవేటు డెయిరీలకు దీటుగా విజయ డెయిరీ అభివృద్ధి


### మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడి




**హైదరాబాద్, జూలై 27 (సమ సమాజం ):** ప్రైవేటు డెయిరీలకు దీటుగా విజయ తెలంగాణ డెయిరీని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పశు సంవర్ధకశాఖ, టీఎస్ఎల్డీఏ సంయుక్తంగా కార్యాచరణ రూపొందించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. రాజేంద్రనగర్‌లోని కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో వివిధ జిల్లాల విజయ డెయిరీ డీడీలు, మేనేజర్లకు ఇంటిగ్రేటెడ్ డెయిరీ డెవలప్‌మెంట్ ఎ÷–లాన్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై వర్క్ షాప్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయరంగం తర్వాత పాడిపరిశ్రమ రంగంపై కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయన్నారు. ఈ పరిశ్రమ రంగం అభివృద్ధికి, దానిపై ఆధారపడ్డ రైతులకు ప్రభుత్వం అన్నిరకాలుగా చేయూతను అందిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన విజయ డెయిరీ తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. పాడి రైతుల అభ్యున్నతికి డెయిరీ ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. డెయిరీకి పాలు పోసే రైతులకు ప్రభుత్వం ఉచితంగా వైద్యసేవలు అందించడంతో పాటు సబ్సిడీపై పాడి గేదెల పంపిణీ, దాణా అందజేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జీవాల వద్దకే వెళ్లి సంచార పశు వైద్యశాలలు సేవలందిస్తున్నాయని గుర్తు చేశారు. మేలు జాతి పశు సంపద, పాల ఉత్పత్తి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విజయ డెయిరీ, పశుసంవర్ధక శాఖ, గోపాల మిత్రలు, టీఎస్ఎల్డీఏ ఆధ్వర్యంలో జీవాల ఆరోగ్య సంరక్షణ, కృత్రిమ గర్భధారణ, ఇతర యాజమాన్య పద్ధతులపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని, ప్రణాళికబద్ధంగా పని చేస్తే పాల ఉత్పత్తి సాధ్యమేనన్నారు. డెయిరీ రైతులతో సమావేశాలు నిర్వహించి.. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలన్నారు. విజయ డెయిరీ ఉత్పత్తులకు విశేషమైన ప్రజాదరణ ఉన్నదని, అన్ని ప్రాంతాల్లో ఉత్పత్తులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. పోటీ మార్కెట్‌లో ప్రైవేటు డెయిరీలకు దీటుగా డెయిరీ ఉత్పత్తులపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. విజయ ఉత్పత్తులను వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్రంలో గుర్తించిన 12 ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఔట్‌లెట్లకు సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించాలని, రాబోయే ఆరు నెలల్లో అమలు చేయాలని ఆదేశించారు. పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికను రూపొందించుకుంటూ.. విజయ డెయిరీని దేశంలోనే ఉన్నత స్థానంలో నిలిపేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని మంత్రి సూచించారు. వర్క్‌షాప్‌లో పశు సంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఆధార్ సిన్హా, డైరెక్టర్ రాంచందర్, ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ హెచ్ఎస్‌కే తంగిరాల తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో మరోమారు పెరిగిన కరోనా కేసులు

### 18,313కు పెరిగినట్లు వైద్యారోగ్య శాఖ వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 27 (సమ సమాజం):** దేశంలో కరోనా కేసులు మరోసారి పెరిగాయి. మంగళవారం 14,830 కేసులు నమోదవగా, తాజాగా అవి 18,313కు పెరిగాయి. దీంతో మొత్తం కేసులు 4,39,38,764కు చేరాయి. ఇందులో 4,32,67,571 మంది బాధితులు కోలుకున్నారు. ఇప్పటివరకు 5,26,167 మంది కరోనాతో కన్నుమూశారు. మరో 1,45,026 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇక గత 24 గంటల్లో 57 మంది మృతిచెందగా, 20,742 మంది బాధితులు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. రోజువారీ పాజిటివిటీ రేటు 4.31 శాతంగా ఉన్నదని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. మొత్తం కేసుల్లో 0.33 శాతం కేసులు యాక్టివ్‌గా ఉండగా, రికవరీ రేటు 98.47 శాతం, మరణాలు 1.20 శాతంగా ఉన్నాయని తెలిపింది. ఇక ఇప్పటివరకు 202.79 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని ప్రకటించింది.

# బాసర ట్రిపుల్ ఐటీ దగ్గర ఉద్రిక్తత

### సంజయ్ కిరణ్ మరణంతో కాంగ్రెస్ ఆందోళన

**బాసర, జూలై 27 (సమ సమాజం):** బాసర ట్రిపుల్ ఐటీ దగ్గర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పీయూసీ విద్యార్థి సంజయ్ కిరణ్ మృతికి వర్సిటీ అధికారులే కారణమంటూ కాంగ్రెస్ నేతలు ధర్నాకు దిగారు. ట్రిపుల్ ఐటీ ప్రధాన గేటు ఎదుట కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళనకు దిగారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు కాంగ్రెస్ నేతలు యత్నించారు. అయితే కాంగ్రెస్ నేతలను బాసర ట్రిపుల్ ఐటీ సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో చదువుతున్న శాబోతు సంజయ్‌కిరణ్ (22) అనారోగ్యంతో మృతి చెందాడు. బాసరలో ఫుడ్‌పాయిజనింగ్ కారణంగానే సంజయ్ మరణించాడని.. అక్కడ భోజనం చేసిన నాటి నుంచే అనారోగ్యం బారిన పడ్డాడని కుటుంబసభ్యులు వాపోతున్నారు. వరంగల్ జిల్లా సంగెం మండలం ఎల్గూరు రంగంపేటకు చెందిన సంజయ్.. 2020లో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు పొందాడు. సంజయ్ తల్లిదండ్రులు శ్రీధర్, శ్రీలత వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. వారిలో సంజయ్ చిన్న కుమారుడు. పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సంజయ్.. జూన్ 20న పరీక్షలు రాసేందుకు వెళ్లి, అక్కడ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో పరీక్షలు రాయకుండానే స్వగ్రామానికి తిరిగొచ్చాడు. నెలరోజులుగా అతడు జ్వరంతో బాధపడుతూ స్వగ్రామంలోనే ఉన్నాడు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినా ఉపయోగం లేకపోయింది. ఆస్పత్రి ఖర్చులు ఎక్కువ అవుతుండడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి, స్థానికంగానే చికిత్స అందించాలని తల్లిదండ్రులు భావించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వరంగల్‌కు సంజయ్‌ను తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

# వూహాన్ నుంచే కరోనా వ్యాప్తి

### సీఫుడ్ మార్కెట్ నుంచి మానవులకు సంక్రమణ, తేల్చి చెప్పిన పరిశోధనలు

న్యూఢిల్లీ,జూలై27(ఆర్ఎన్ఎ): కోవిడ్19 పుట్టుకకు సంబంధించిన కొన్ని కొత్త విషయాలు తెలిశాయి. ఆ వైరస్ చైనాలోని వుహాన్‌లో ఉన్న సీఫుడ్ మార్కెట్ నుంచే వ్యాపించి ఉంటుందని శాస్త్రవేత్తలు ఒక నిర్ధారణకు వచ్చారు. దీనికి సంబంధించిన ఆధారాలను వాళ్లు ప్రజెంట్ చేశారు. రెండు వేర్వేరు అధ్యయనాలకు సంబంధించిన నివేదికలను జర్నల్ సైన్స్‌లో పబ్లిష్ చేశారు. కోవిడ్ తొలుత వుహాన్‌లోని మార్కెట్ నుంచి వ్యాపించిందా లేక ల్యాబ్ నుంచి లీకైందా అన్న డౌట్స్ ఉండేవి. అయితే ఆ ప్రాణాంతక వైరస్ వుహాన్‌లోని సీఫుడ్ మార్కెట్‌లో ఉన్న జంతువుల నుంచి మానవులకు సంక్రమించినట్లు రెండు స్టడీలు తేల్చాయి. వుహాన్ మార్కెట్ ప్రాంతంలో చాలా కేసులు తొలుత నమోదు అయినట్లు ఓ స్టడీలో స్పష్టం చేశారు. ఇక జన్యు సమాచారం ద్వారా వ్యాధి వ్యాప్తి గురించి రెండో స్టడీ ద్వారా తేల్చారు. 2019 నవంబర్ లేదా డిసెంబర్‌లో మనుషుల్లోకి రెండు వేరియంట్లు ప్రవేశించినట్లు ఆ అధ్యయనాలు సూచించాయి. సార్స్ సీవోవీ 2 వైరస్ 2019లో హునన్ మార్కెట్‌లో అమ్మిన జంతువుల్లో ఉన్నట్లు గుర్తించామని పరిశోధకులు తెలిపారు. సెంటర్‌లో పనిచేస్తున్న వారికి తొలుత ఆ వైరస్ ట్రాన్స్‌మిట్ అయినట్లు శాస్త్రవేత్తలు చెప్పారు. జంతువుల నుంచి మనిషికి వైరస్ సోకిందని తేల్చారు. గ్లాస్‌గో యూనివర్సిటీలో పనిచేసే వైరాలజిస్ట్ ప్రొఫెసర్ డేవిడ్ రాబర్ట్‌సన్ ఓ రిపోర్ట్‌ను తయారు చేశారు. వైరస్ ల్యాబ్ నుంచి లీకైందన్న రికార్డులను ఇది సరిచేస్తుందని ఆయన అన్నారు. వైరస్ పుట్టుక గురించి రెండేళ్ల నుంచి శాస్త్రవేత్తలు స్టడీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ కొత్త నివేదికల ద్వారా వాళ్లు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. వుహాన్‌లో తొలుత ఆస్పత్రి పాలైన వారిలో 50 శాతం మంది మాత్రమే సీఫుడ్ మార్కెట్‌తో డైరెక్ట్ లింకు ఉన్నట్లు గుర్తించారు. వుహాన్‌లో నమోదు అయిన కేసులను మ్యాపింగ్ చేయడం ద్వారా కూడా కొన్ని స్పష్టమైన విషయాలు తెలిసాయని ఆరిజోనా యూనివర్సిటీలోని ఎకాలజీ, ఎవల్యూషనరీ బయాలజీ శాఖ ప్రొఫెసర్ మైఖేల్ వోరోబే తెలిపారు. మార్కెట్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి తీసుకున్న శ్యాంపిళ్ల ద్వారా శాస్త్రవేత్తలు కేసు మ్యాప్‌ను క్రియేట్ చేశారు. మార్కెట్‌కు దక్షిణదిశగా ఉన్న ప్రాంతంలో ఎక్కువగా కేసులు కేంద్రీకృతమై ఉన్నట్లు గుర్తించామని ప్రొఫెసర్ రాబర్ట్‌సన్ తెలిపారు. ఆ ప్రాంతంలో ఎక్కువగా రక్కూన్ డాగ్స్‌ను అమ్ముతున్నట్లు తేలిందన్నారు. సార్స్ సీవోవీ2 వైరస్‌ను మోసుకువెళ్లే జంతువుల్ని ఆ మార్కెట్‌లో అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు.

# వరదప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు

### అధికారులు అప్రమత్తంగా ఉండాలన్న కెటిఆర్

### అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

### జంటజలాశయాలను పరిశీలించిన దానకిశోర్




**హైదరాబాద్, జూలై 27 (సమ సమాజం ):** వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలక, ఐటీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాల నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు పలు పట్టణాల్లో పరిస్థితులపై ప్రగతి భవన్ నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీహెచ్ఎంసీ, జలమండలి, పురపాలక శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షాలు, వరద పరిస్థితులపై ఉన్నతాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రాణనష్టం జరుగకుండా చూడడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. వర్షాలు కొనసాగితే ముందు జాగ్రత్తలపై సిద్ధంగా ఉండాలన్నారు. పురాతన భవనాలను తొలగించే పనులు చేపట్టాలని, కల్వర్టులు, వంతెనల వద్ద హెచ్చరిక సూచీలు పెట్టాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ, జలమండలి సేవలు వినియోగించుకోవాలన్నారు. పురపాలికలో సహాయ చర్యలను సీఎండీఏ పర్యవేక్షించాలని చెప్పారు. పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలని, సాగునీటి వనరులకు సంబంధించిన పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. వర్షాలు తగ్గాక అవసరమైతే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జంట జలాశయాలకు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో గండిపేట, హిమాయత్ సాగర్ జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ఇన్ఎ÷–లో భారీగా ఉండటంతో గండిపేట 13 గేట్లు, హిమాయత్ సాగర్ 8 గేట్లు ఎత్తి నీటిని మూసీ నదిలోకి వదులుతున్నారు. ఈ క్రమంలో జంట జలాశయాలను బుధవారం ఉదయం జలమండలి ఎండీ దానకిశోర్ సందర్శించారు. వరద ప్రవహాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష జరిపారు. రెండు జలాశయాల వద్ద భద్రత మరింత పెంచాలని సూచించారు. సామాన్య ప్రజలు, సందర్శకులు ఇటువైపు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూసీ నదిలోకి నీటిని వదులుతున్నందున అప్రమత్తంగా ఉండాలని నది పరివాహక ప్రాంతాల వారికి సూచించారు. తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని జలమండలి, జీహెచ్ఎంసీ, పోలీసుల శాఖకు సూచించారు. మూడు పోలీస్ కమిషనరేట్లతో జలమండలి నిరంతరం సమన్వయం చేసుకొంటోందని తెలిపారు. గత సంవత్సరం ఒక్క హిమాయత్ సాగర్ నుంచే 26 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు, ఈసారి రెండు జలాశయాల నుంచి గతసారి కంటే తక్కువ నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, ట్రాన్స్‌మిషన్ సీజీఎం దశరథ రెడ్డి, జీఎంలు, డీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కేటాయించిన చోటే గురుకులాలు ఉండాలి

### ఇతర ప్రాంతాల్లో ఉంటే తరలించాల్సిందే

### అధికారులకు సూచించిన మంత్రి కొప్పుల



**హైదరాబాద్, జూలై 27 (సమ సమాజం):** ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు మంజూరై వేరే దగ్గర కొనసాగుతున్న గురుకులాలను కేటాయించిన చోటుకు తరలించేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి కొప్పుల ఈశ్వర్,ఎస్సీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. సొసైటీకి చెందిన 43 గురుకులాలు కేటాయించిన చోట కాకుండా వేరే ప్రాంతంలో కొనసాగుతున్నాయని, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వీటిని ఆయా నియోజకవర్గాలకు వెంటనే తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్సీ గురుకులాలకు చెందిన పలు అంశాలపై బుధవారం మంత్రి కొప్పుల , సొసైటీ కార్యదర్శి రోనాల్డ్ రాస్ అధికారులు, ఆర్సీవోలు, ప్రిన్సిపాల్స్ తో జూమ్ మీటింగ్ జరిపారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ కు మంత్రి, కార్యదర్శి పలు సూచనలు సూచనలిచ్చి దిశానిర్దేశర చేశారు. ప్రతి విషయంలో ప్రధాన కార్యాలయంపై ఆధారపడకుండా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సహకారం తీసుకుంటే బాగుంటుందని సలహానిచ్చారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో అవసరమైన ఎఎన్ఎంలు, నాన్–టీచింగ్ స్టాఫ్ నియమాకాల గురించి జిల్లా కలెక్టర్ ను సంప్రదించాలన్నారు. వానలు, వరదల కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిరక్షణకు మొదటి ప్రాధాన్యతనివ్వాలన్నారు. పాఠశాల ఆవరణలోని వెల్ నెస్ సెంటర్ సిబ్బంది ప్రతి నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని, అవసరమైన మందులు నిల్వపెట్టుకోవాలని పలు సూచనలిచ్చారు. అదేవిధంగా స్థానిక దవాఖాన సహకారంతో విద్యార్థులందరికి బూస్టర్ డోసు టీకాలు ఇప్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలాలలో పెద్ద ఎత్తున మొక్కల్ని నాటాలని అధికారులను ఆదేశించారు.

# యాదగిరిగుట్ట నుంచి మూడో విడత పాదయాత్ర

### బిజెపి పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న బండి

### ప్రజల్లో నమ్మకాన్ని కలిగించేందుకే అని వెల్లడి

### రాజగోపాల్‌రెడ్డి చేరికను ధృవీకరించిన బిజెపి అధ్యక్షుడు

హైదరాబాద్,జూలై27(ఆర్ఎన్ఎ): యాదగిరిగుట్ట నుంచి మూడో విడత పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు బీజేపీ స్టేట్ చీఫ్ బండి సంజయ్ అన్నారు. మొదటి విడత పాదయాత్రలో భాగ్యలక్ష్మి అమ్మవారు.. రెండో విడత పాదయాత్రలో జోగులాంబ అమ్మవారి శక్తి ఏంటో చూశారన్నారు. ప్రజలను ఇబ్బందులు పెట్టే వాళ్ళను యాదగిరిగుట్ట నర్సింహ స్వామి వారు ఎలా తెరమరుగు చేస్తారో అందరికి తెలుసని..అందుకే మూడో విడత పాదయాత్రను స్వామి వారి ఆశీస్సులతో మొదలు పెట్టబోతున్నామన్నారు. యాదగిరిగుట్ట నుంచి వరంగల్ భద్రకాళి అమ్మవారు దేవాలయం వరకు మూడో విడత పాదయాత్ర ఉంటుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల జరిగాయంటే పాదయాత్రే కారణమని బండి సంజయ్ అన్నారు. పాదయాత్ర ప్రజలకు ఒక భరోసా అని బండి సంజయ్ అన్నారు. బీజేపీలోకి కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేరికను బండి సంజయ్ ధృవీకరించారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డితో పాటు అనేక మంది బీజేపీలోకి వస్తారని స్పష్టం చేశారు. త్వరలో రాజగోపాల్ రెడ్డి ఢిల్లీలో కాషాయ కండువా కప్పుకుంటారని చెప్పారు. అధికార టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా తమతో సంప్రదింపులు జరుపుతున్నారని, సరైన సమయంలో టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీ కండువా కప్పుకుంటారన్నారు. చేరికలపై తమ పార్టీలో భిన్నాభిప్రాయాలు లేవని, హైకమాండ్‌కు మాత్రమే తాము జవాబుదారీ అని, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఈడీని బీజేపీ కంట్రోల్ చేస్తోందనేది ప్రతిపక్షాల ప్రచారం మాత్రమేనని బండి సంజయ్ అన్నారు.

# ముగిసిన సోనియా ఇడి విచారణ

### మూడోరోజు మూడుగంటలపాటు విచారణ

### అవసరమైతే మళ్లీ పిలుస్తామని అధధికారుల వెల్లడి

### మూడోరోజూ కొనసాగిన కాంగ్రెస్ ఆందోళనలు




**న్యూఢిల్లీ, జూలై 27 (సమ సమాజం):** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ విచారణ ముగిసింది. బుధవారం 3 గంటలపాటు ప్రశ్నించాక ఈడీ కార్యాలయం నుంచి ఆమె ఇంటికి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో అధికారులు సోనియాకు భోజన విరామం ఇచ్చారు. తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు విచారణకు రావాలని తొలుత సమాచారం ఇచ్చారు. అయితే కొద్దిసేపటి తర్వాత విచారణ ముగిసిందని సమాచారం చేరవేశారు. తాజాగా ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని అధికారులు చెప్పారు. ఈడీ కేంద్ర కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అవసరమైతే మరోసారి పిలుస్తామని చెప్పారని సమాచారం. కాబట్టి ప్రస్తుతానికి సోనియా విచారణ ముగిసినట్టే భావిస్తున్నారు. ఇప్పటికే 3 రోజులపాటు సోనియాను అధికారులు ప్రశ్నించారు. మూడు రోజుల్లో మొత్తం 12 గంటలపాటు ఈడీ అధికారులు ఆమెను ప్రశ్నించారు. ఈనెల 21న 3 గంటలు, మంగళవారం రెండు దఫాలుగా 6 గంటల పాటు ప్రశ్నావళి కురిపించారు. ఇక బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గం.ల వరకు ఈడీ అధికారులు ప్రశ్నించారు. మంగళవారం 6 గంటలపాటు విచారణ 'నేషనల్ హెరాల్డ్' మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని ఈడీ అధికారులు మంగళవారం ఏకంగా 6 గంటలపాటు ప్రశ్నించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పలు విడతల్లో ఆమె ఈడీ ప్రశ్నలను ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ స్టేట్‌మెంట్‌ను ఈడీ నమోదుచేసింది. కాగా.. నేషనల్ హెరాల్డ్ పత్రిక, యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వ్యవహారాల్లో ఆమె పాత్రపై అధికారులు ఆరాతీశారు. ఆయా సంస్థల్లో రాహుల్ గాంధీ పాత్ర గురించి కూడా సోనియాను ప్రశ్నించారు. ఈడీకి గతంలో రాహుల్ ఇచ్చిన సమాచారంతో సోనియా స్టేట్‌మెంట్‌ను పోల్చి చూడనున్నట్టు ఈడీ అధికారి తెలిపారు. మరోవైపు, ఈడీ విచారణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు ఆందోళన చేశారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోనియాను ఇప్పటివరకు 95 నుంచి 110 ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. అయితే కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పిన సోనియా.. మరికొన్నింటికి తనకు తెలియవని చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నేషనల్ హెరాల్డ్ పబ్లిషర్ అయిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ టేకోవర్‌కు సంబంధించిన లావాదేవీల గురించి సోనియాను ప్రశ్నించగా.. అవన్నీ మోతీలాల్ వోరాకే తెలుసని ఆమె చెప్పినట్లు ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ సీనియర్ నేత అయిన మోతీలాల్ వోరా.. మధ్యప్రదేశ్ సీఎంగా, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా, ఆలిండియా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా అనేక బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కోశాధికారిగానూ వ్యవహరించారు. 2020 డిసెంబరులో ఆయన అనారోగ్యంతో కన్నుమూశారు. సోనియాను ఈడీ ప్రశ్నిస్తున్న సమయంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ నేతలు బైఠాయించారు. మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నేతలతో పాటు సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్ సైతం నిరసనల్లో పాల్గొనడం గమనార్హం. రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో కాంగ్రెస్?పక్షనేత అధిర్ రంజన్ చౌదరి ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎంపీలు నిరసనకు దిగారు. నిత్యవసర వస్తువులపై జీఎస్టీ విధించడం సహా పార్లమెంట్ ఉభయసభల్లో విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని ఖండించారు. ఈ మేరకు పార్లమెంట్ కాంప్లెక్స్ నుంచి విజయ్ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అక్కడ బైఠాయించి నినాదాలు చేశారు. అయితే, నిమిషాల వ్యవధిలోనే పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన వారిని సైతం నిర్బంధించారు.'ధరల పెరుగుదల, జీఎస్టీ వంటి సమస్యలపై ప్రజల తరఫున మేం పోరాడుతున్నాం. ఈడీ సహా దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడంపై మా పోరాటం కొనసాగిస్తాం. ఎంపీలపై సస్పెన్షన్ విధించడం తప్పు. దాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అని ఖర్గే అన్నారు. 'విపక్షాలు లేని దేశాన్ని ప్రభుత్వం కోరుకుంటోంది. దర్యాప్తు ఏజెన్సీలను సర్కారు ఇలా ఉపయోగించడాన్ని బట్టి చూస్తే ఇది స్పష్టమవుతోంది' అని కాంగ్రెస్ లోక్‌సభాపక్షనేత అధిర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు.

# భారత్‌లో సిటీ బ్యాంక్ కన్జూమర్ బిజినెస్ టేకోవర్

### యాక్సిస్ బ్యాంక్ ప్రతిపాదనకు సీసీఐ ఆమోదం

**న్యూఢిల్లీ, జూలై 27 (సమ సమాజం):** భారత్‌లో సిటీ బ్యాంక్ కన్జూమర్ బిజినెస్‌ను టేకోవర్ చేసుకోవాలన్న యాక్సిస్ బ్యాంక్ ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా సీసీఐ ఆమోదం తెలిపింది. సిటీ బ్యాంక్–యాక్సిస్ బ్యాంక్ మధ్య కుదిరిన ఈ ఒప్పందం దేశీయంగా ఫైనాన్సియల్ సర్వీసెస్ రంగంలోనే అతిపెద్దది. గత మార్చి 30న భారత్‌లో సిటీ బ్యాంక్ బిజినెస్‌ను టేకోవర్ చేసుకునేందుకు యాక్సిస్ బ్యాంక్ దాఖలు చేసిన బిడ్‌కు ఆమోదం లభించింది. రూ.12,325 కోట్ల విలువైన ఈ ఒప్పందంలో భాగంగా భారత్‌లో సిటీ బ్యాంక్ క్రెడిట్ కార్డులు, పర్సనల్ లోన్స్, వెల్త్ మేనేజ్మెంట్ బిజినెస్.. యాక్సిస్ బ్యాంకులో విలీనం అవుతాయి. సిటీ బ్యాంక్ భారత్ బిజినెస్‌ను టేకోవర్ చేయాలన్న యాక్సిస్ బ్యాంక్ ప్రతిపాదనను ఆమోదించినట్లు సీసీఐ ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. దేశీయ పారిశ్రామిక రంగంలో రెండు సంస్థల మధ్య విలీన, టేకోవర్ ఒప్పందాలకు సీసీఐ ఆమోదం తప్పనిసరి. సిటీ బ్యాంక్‌తో యాక్సిస్ బ్యాంక్ చేసుకున్న ఒప్పందం ప్రకారం 2024 సెప్టెంబర్ నాటికి యాక్సిస్ బ్యాంకుకు 30 లక్షల మంది నూతన కస్టమర్లు జత కలుస్తారు. కన్జూమర్ బిజినెస్ లాభదాయకంగా లేనందున భారత్ సహా పలు దేశాల మార్కెట్ల నుంచి నిష్క్రమిస్తున్నట్లు గతేడాది సిటీ




# చలన చిత్రం



## తమిళంలో ఆఫర్ కొట్టేసిన చాందిని


తెలుగమ్మాయిలకు టాలీవుడ్‌లో అగ్రకథానాయికలుగా ఎదిగే యోగం లేదని చాలా సార్లు ప్రూవ్ అయింది. వారిలో చాలా మంది ఇతర భాషల్లో టాప్ హీరోయిన్స్ గా చెలామణి అయ్యారు. తాజాగా ఆ జాబితాలోకి చేరిన మరో తెలుగమ్మాయి చాందినీ చౌదరి. విశాఖపట్నానికి చెందిన ఈ అమ్మాయి మెకానిక్ ఇంజినీరింగ్ చదివి.. సినిమాలపై పేషన్‌తో కథానాయిక అవ్వాలనుకుంది. ఆ క్రమంలో కొన్ని షార్ట్ ఫిల్మ్ లోనూ, యూట్యూబ్ సిరీస్ లోనూ నటించింది. కొన్ని సినిమాల్లో చిన్న చిన్నపాత్రలు పోషించింది. సుహాస్ హీరోగా నటించిన 'కలర్‌ఫోటో' చిత్రంతో చాందిని కథానాయికగా గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా నేషనల్ అవార్డ్‌ను గెలుచుకోవడం ఆమెకు ప్లస్ అయింది. ఇటీవల విడుదలైన 'సమ్మతమే' చిత్రంతో కూడా హీరోయిన్‌గా మంచి మార్కులేయించుకుంది. అయితే చాందిని చౌదరి కేవలం తెలుగు సినిమాల్నే నమ్ముకోవడం లేదు. మంచి స్క్రిప్ట్ వస్తే ఇతర భాషల్లోనైనా నటించే ఆలోచనలో ఉంది. దానికి తగ్గట్టుగానే కోలీవుడ్ నుంచి ఓ మంచి అవకాశం ఆమెను వెతుక్కుంటూ వచ్చింది. ఈ విషయాన్ని చాందిని తన ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా అధికారికంగా తెలియచేసింది. కోలీవుడ్‌లోని ఓ అగ్ర నిర్మాణ సంస్థ క్రేజీ ప్రాజెక్ట్‌లో చాందిని మెయిన్ లీడ్‌లో నటించబోతున్నట్టు సమాచారం. కోలీవుడ్‌లో నిలకడగా విజయాలు అందుకుంటే.. మాత్రం చాందిని అగ్రకథానాయిక అవడం ఖాయం అంటున్నారు.ఆకర్షించే అందంతో పాటు, ఆకట్టుకొనే అభినయం చాందిని చౌదరి సొంతం. ప్రస్తుతం 'గామి' అనే తెలుగు సినిమాలో నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. దీంతో పాటు మరికొన్ని ప్రాజెక్ట్స్ చర్చల దశలో ఉన్నాయి. త్వరలోనే ఆమె నటించే తమిళ సినిమాను అధికారికంగా ప్రకటించబోతున్నట్టు సమాచారం. మరి తెలుగు నుంచి తమిళంలోకి వెళ్ళి అగ్రకథానాయికలుగా మెరిసిన కొందరు తెలుగమ్మాయిల జాబితాలో కూడా చాందిని చౌదరి చేరుతుందేమో చూడాలి.



## మహేశ్ త్రివిక్రమ్ సినిమాలో లేను బీమ్లా నాయక్ బ్యూటీ సంయుక్తా మీనన్

భీమ్లా నాయక్' మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది మలయాళ బ్యూటీ సంయుక్త మీనన్. ఈ చిత్రంలో రానా సరసన నటించిన ఆమెకు నటన పరంగా మంచి మార్కులు పడ్డాయి. తన అందం , అభినయంతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో ఆమెకు తెలుగు ఆఫర్స్ క్యూ కట్టాయి. ప్రస్తుతం ఆమె తెలుగులో వరుస సినిమాలతో దూసుకుపోతుంది. త్వరలోనే బింబిసార చిత్రంతో ప్రేక్షకుల ముందుకి రాబోతుంది. ఆగష్టు 5న ఈ మూవీ థియేటర్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్లో భాగంగా ఆమె మీడియాతో ముచ్చటించింది. ఈ సందర్భంగా సంయుక్తి పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఈ క్రమంలో హీరో ధనుష్‌తో గొడవలంటూ వచ్చిన పుకార్లపై స్పందించింది. కాగా సంయుక్త, ధనుష్ సరసన సార్ మూవీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇది ధనుష్ స్ట్రయిట్ తెలుగు చిత్రమిది. ఈ మూవీ షూటింగ్ సమయంలో తనకు, ధనుష్‌కు గొడవ జరిగిందని, దీంతో మధ్యలోనే ఆమె మూవీ సెట్ నుంచి వెళ్లిపోయినట్లు గతంలో జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా ఆమెను దీనిపై ఓ విలేకరి ప్రశ్నించగా.. సంయుక్త ఆసక్తిగా స్పందించింది. 'ధనుష్‌తో నాకు గొడవలా! నిజంగానే అలాంటి వార్తలు వచ్చాయా? నాకు తెలియదు. అలాంటి వార్తలు రాయాలంటే క్రియేటివిటీ ఉండాలి' అంటూ ధనుష్‌తో గొడవలపై క్లారిటీ ఇచ్చింది. అంతేగాక మహేశ్-త్రివిక్రమ్‌లో చిత్రంలో తను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో కూడా ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. కాగా ధనుష్ హీరోగా వెంకి అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితారా ఎంటర్‌టైనమెంట్స్ సంస్థ నిర్మిస్తుంది. ఈ మూవీ కోసం తను 21 రోజుల కాల్షీట్‌ను కెటాయించానని, ఓ పాట మినహా తనకు సంబంధించిన చిత్రీకరణ పూర్తయిందని ఈ సందర్భంగా సంయుక్త మీనన్ తెలిపింది. త్వరలోనే ఈ పాట షూటింగ్‌లో పాల్గొననున్నట్లు ఆమె వెల్లడించింది.

## రణ్‌వీర్‌కు మద్దతు ప్రకటించిన వివేక్ అగ్నిహోత్రి



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నగ్న ఫొటోషూట్ ఎంతటి దుమారం రేపుతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీంతో రణ్‌వీర్ సింగ్ ఫొటోషూట్ హాట్‌టాపిక్ మారింది. ఈ విషయంలో కొందరు రణ్‌వీర్‌కు మద్దుతు ఇస్తుండగా.. మరికొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. మహిళల మనోభవాలు దెబ్బతీశాడంటూ రణ్‌వీర్‌పై ముంబైలో పోలీసు కేసు కూడా నమోదైన సంగతి తెలిసిందే. అయితే తాజాగా దీనిపై 'కశ్మీర్ ఫైల్స్' దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి స్పందించాడు. ఈ మేరకు ఆయన ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. రణ్‌వీర్ సింగ్‌పై వస్తున్న విమర్శలు, ఎఫ్ఐఆర్‌ను ఖండించాడు. ఇందులో తప్పేముందంటూ రణ్‌వీర్‌కు మద్దతుగా నిలిచాడు. 'రణ్‌వీర్ ఫొటోషూట్‌పై నమోదైన ఎఫ్ఐఆర్ చెల్లదు. అది ఓ స్టుపిడ్ కేసు. ఎలాంటి కారణం లేకుండా నమోదైన కేసు అది. మహిళల మనోభవాలు దెబ్బతిన్నాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అయితే ఇక్కడ నాకో విషయం అర్థం కావడటం లేదు. ఇప్పటికే ఎన్నో మహిళల నగ్న చిత్రాలు వచ్చాయి. వాటి వల్ల పురుషుల మనోభవాలు దెబ్బతినవా? దాని సంగతేంటి? ఇదో మూర్ఖపు వాదన. ఇలాంటి వాటిని ఎంటర్‌టైన్ చేయను. మన సంస్కృతిలోనే మానవ శరీరానికి గౌరవం ఉంది. మానవ శరీరం భగవంతుడి అద్భుత సృష్టి అని నేను నమ్ముతున్నాను. అందుకే దీనికి నేను మద్దతు ఇవ్వను' అంటూ చెప్పుకొచ్చాడు. అయితే ఇప్పటికే రణ్‌వీర్‌కు దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో పాలు పలువురు సినీ ప్రముఖులు మద్దుతుగా నిలుస్తున్నారు. కాగా ఓ మ్యాగజైన్ కోసం రణ్‌వీర్ ఒంటి మీద నూలు పోగు లేకుండా ఫోటో షూట్ ఇచ్చాడు. . ఈ ఫోటోని ఆయనే స్వయంగా సోషల్ మీడియాలో షేర్ చేయడంతో నెట్టింట తెగ వైరల్ అయింది. ఇక దీనికి తన ఫ్యాన్ నుంచి 'హాట్' అంటూ కామెంట్స్ రాగా మరికొందరు ఈ పిచ్చి చేష్టలేంటని విమర్శిస్తున్నారు.



## రాయ్ లక్ష్మి అందాల ఆరబోత తగ్గేది లేదంటున్న అమ్మడు

తెలుగు ప్రేక్షకులకు అప్పడెప్పడో ఇరవై ఏళ్ల క్రితం కాంచనమాల కేబుల్ టీవీ సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ రాయ్ లక్ష్మి ఇప్పటికి కూడా అదే అందంతో వరుస సినిమాలు చేస్తూ వస్తోంది. దాదాపుగా రెండు దశాబ్దాలుగా హీరోయిన్‌గా కొనసాగడం అంటే మామూలు విషయం కాదు. హీరోయిన్ గా రెండు దశాబ్దాల కెరీర్ ను కలిగిన వారు చాలా తక్కువ మంది ఉంటారు. బ్లాక్ బస్టర్ లు పడకున్నా కూడా ఇన్నాళ్లు కంటిన్యూ అవ్వడం కేవలం ఈమెకే సాధ్యం అయ్యిందని నెటిజన్స్ మరియు ఇండస్టీ వర్గాల వారు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. హీరోయిన్ గా ఇప్పటికి కూడా ఏదో ఒక సినిమా లో నటించడం లేదంటే ఏదో ఒక ముఖ్య పాత్రలో అది కాదంటే ఐటెం సాంగ్స్ లో అయినా ఈ అమ్మడు అన్ని భాషల్లో ప్రతి ఏడాది సందడి చేస్తూనే ఉంది. హీరోయిన్ గా రాయ్ లక్ష్మి ఇంతగా మళ్లీ బిజీ అవ్వడంకు ఆమె ఫోటో షూట్స్ ఒక కారణం అంటూ ఆమె సన్నిహితులు కూడా అంటూ ఉంటారు. ఇన్ స్టా లో ఈ అమ్మడి ఫోటోలు చూసిన ఫిల్మ్ మేకర్స్ ఆమెతో వర్క్ కు ఆసక్తిగా ఉంటారు అనేది టాక్. అందుకే తన ప్రతి ఫోటో షూట్ ను చాలా స్పెషల్ గా ఈ అమ్మడు ఉండేలా ఎ÷-లాన్ చేసుకుంటూ ఉంది. తాజాగా ఈ అమ్మడు ఈ ఫోటోలు షేర్ చేసి ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించింది. టాప్ యాంగిల్ నుండి ఈ అమ్మడి ఫోటోను చూస్తే మతి పోవాల్సిందే. క్లీ వేజ్ షో చేయడంతో పాటు అందాల రాయ్ లక్ష్మి చాలా యూనిక్ డ్రస్ లో అదరగొట్టింది. అందాల రాయ్ లక్ష్మి ఇదే అందంతో కొనసాగితే మరో పదేళ్ల వరకు కూడా హీరోయిన్ గా లేదంటే ఐటెం సాంగ్స్ చేస్తూ బిజీగా ఉండే అవకాశాలు ఉన్నాయంటూ అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ అమ్మడు లెజెండ్ సినిమా లో నటించింది. ఆ సినిమా విడుదలకు రెడీ అయ్యింది. ఆ సినిమా ప్రమోషన్ లో ఈ అమ్మడు పాల్గొంటూ బిజీగా ఉంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar **PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in